సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 23 । అక్టోబర్ । 2024

పొన్నారిలో ట్రైయినీ అధికారులు..

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో సివిల్ సర్వీసెస్ ట్రైయినీ అధికారులు విశ్వదీప్‌మట్టు, అమర్జీత్, కుల్దీప్ మీనా, ప్రశాంత్ నానావారే, పూజా కుమారీ, శుభీచౌహాన్ మంగళవారం పర్యటించారు. శిక్షణలో భాగంగా మండల అధికారులతో కలిసి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, తదితరులున్నారు.



పథకాల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

గరిష్టం/కనిష్టం
33.0/22.0

వాతావరణం

చాలా వరకు ఎండగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.



పెండల్వాడ గ్రామ సందర్శనలో ట్రైయినీ అధికారులు

సంకల్ప బలం.. విజయ సోపానం

సక్సెస్ స్టోరీ

- పట్టుదలతో ప్రయత్నిస్తే లక్ష్యసాధన సులువే
- జిల్లాకు విచ్చేసిన 'సివిల్స్' సాధకుల మనోగతం

'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి.. ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి.. విశ్రమించవద్దు ఏ క్షణం.. విస్మరించవద్దు నిర్ణయం.. అప్పుడే నీ జయం నిశ్చయం రా..' అంటూ ఓ సినీ గేయ రచయిత అన్న మాటలు ఆచరణలో అక్షర సత్యాలుగా పేర్కొంటున్నారు వీరు. సంకల్పమే విజయానికి నాందిగా నిలుస్తుందని.. ఒకటి, రెండుసార్లు నిరాశ ఎదురైనా నిరుత్సాహం దరి చేరనివ్వద్దని అంటున్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం తప్పక వరిస్తుందని సివిల్స్ ట్రైయినీలు అభిప్రాయపడుతున్నారు. ఆలిండియా స్థాయి సర్వీస్‌లకు ఎంపికై జిల్లాకు శిక్షణ నిమిత్తం విచ్చేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు యువ అధికారులను 'సాక్షి' మంగళవారం పలకరించింది. సంకల్పానికి తోడైన కఠోర శ్రమ.. లక్ష్య సాధన దిశగా పడిన అడుగులు..విజయతీరాలకు చేరిన వైనం వారి మాటల్లోనే.. -కైలాస్‌నగర్/తాంసి

జిల్లాలో 21 మంది పర్యటన

ఆలిండియా సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన 21 మందిని కేంద్రం శిక్షణ నిమిత్తం ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించింది. 2021, 2024 బ్యాచ్‌లకు సంబంధించి ఐపీఎస్ క్యాడర్ ఐదుగురు, ఐఎఫ్‌వోఎస్ నలుగురు, ఐఆర్ఎస్ నలుగురు, ఐపీవోఎస్ ఒకరు, ఐఈఎస్ ఇద్దరు, ఐపీ అండ్ టీఏఎఫ్ఎస్ ఒకరు, ఐఎస్ఎస్ క్యాడర్ నలుగురు ఉన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన వీరంతా ఈ నెల 21 నుంచి 28 వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పర్యవేక్షించనున్నారు. ప్రజల జీవన స్థితిగతులను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటూ అధ్యయనం చేయనున్నారు.

మూడో ప్రయత్నంలో ఎంపికయ్యా



నాది ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని గురుగంజ్ జిల్లా సునిసీ గ్రామం. నాన్న చతుర్భుజ్ గుప్తా వ్యాపారి. అమ్మ కామిణి గృహిణి. ఢిల్లీ యూనివర్సిటీలో విద్యనభ్యసించా. చదువు పూర్తయిన వెంటనే సివిల్స్‌పై దృష్టి సారించా. మొదటి రెండు ప్రయత్నాల్లో ఇంటర్వ్యూ వరకు వెళ్లినా ఎంపిక కాలేదు. అయినా నిరాశ చెందలే. మరింత పట్టుదలతో ప్రయత్నించా. పొరపాట్లు సవరించుకుంటూ మూడో ప్రయత్నంలో విజయం సాధించా. 2024 సివిల్స్ ఫలితాల్లో ఐదో ర్యాంకు సాధించి ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యా. ఎలాంటి శిక్షణకు వెళ్లకుండా సొంతంగా రోజుకు 10 నుంచి 11గంటలు చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించా. కేంద్రం నన్ను ఏ రాష్ట్రంలో కేటాయించినా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తా.

–ప్రకార్‌గుప్తా, ఐఎస్ఎస్ క్యాడర్

ఉద్యోగం చేస్తూనే.. సివిల్స్ సాధించా



నాది రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ జిల్లాలోని నటా టా గ్రామం. నాన్న బద్రి ప్రసాద్ మీనా. రిటైర్డు బ్యాంకు ఎంప్లాయ్. అమ్మ గీసిదేవి మీనా గృహిణి. జైపూర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్ నుంచి ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పొందాను. చదువు పూర్తయ్యాక ఎల్ఐసీలో తర్వాత ఎస్‌బీఐ లో ఉద్యోగం చేశా. జాబ్ చేస్తూనే సివిల్స్ కు ప్రిపేరయ్యా. 2020లో బ్యాంకు కొలువును వదిలేశా. అప్పుడే కోవిడ్ ప్రారంభమైంది. ఉద్యోగం కోల్పోవడం, కరోనా తీవ్రత పెరగడంతో ఎలాగైనా సివిల్స్ సాధించాలని నిర్ణయించుకున్నా. రెండు సార్లు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. గట్టిగా ఆలోచించా. ఎక్కడ వెనుకబడుతున్నా.. అనే దానిపై దృష్టి సారించా. టాపర్ల సక్సెస్ స్టోరీలను యూ ట్యూబ్‌లో చూస్తూ సన్నద్ధమయ్యాను. మూడో ప్రయత్నంలో 565ర్యాంకు సాధించాను. రాజస్థాన్ క్యాడర్‌కే ఎంపికయ్యా ను. నాలుగో ప్రయత్నంలో నూ సివిల్స్‌కు ఎంపికవ్వగా ఇంకా సర్వీస్ కేటాయించలేదు.

– రోషన్ మీనా, ఐపీఎస్

చిన్ననాటి కల నెరవేర్చుకున్నా..



నాది ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ముజఫర్‌నగర్ జిల్లా చరత్వాల్ గ్రామం. నాన్న నీరజ్ త్యాగి రైతు. అమ్మ రష్మీ త్యాగి గృహిణి. ముజఫర్‌నగర్‌లోనే బీఎస్సీ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో డిగ్రీ పూర్తి చేశాను. చిన్నతనం నుంచే యూనిఫాం సర్వీస్‌లో చేరాలని కలలు కనే వాన్ని. రైతుగా నాన్న పడ్డ కష్టం చూశాక సివిల్స్ సాధించాలని మరింత దృఢంగా నిర్ణయించుకున్నా. అదే సంకల్పంతో ఎలాంటి కోచింగ్‌కు వెళ్లకుండా పట్టుదలతో ప్రయత్నించాను. రోజుకు 6నుంచి 7గంటలు కష్టపడి చదివా. ముఖ్యంగా దినపత్రికలపై ఫోకస్ పెట్టా. 2022 సివిల్స్ ఫలితాల్లో 437 ర్యాంకు సాధించాను. నాగాలాండ్ రాష్ట్ర క్యాడర్ ఐపీఎస్‌గా ఎంపికయ్యాను. తొలి ప్రయత్నంలోనే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం ఎంతో సంతోషానిచ్చింది.

– రాంనీక్ గౌతమ్, ఐపీఎస్

పోలీస్ కావాలనుకున్నా..



నాది హర్యానా రాష్ట్రం. నాన్న జవహర్ సింగ్ రావత్ పీడబ్ల్యూడీ శాఖలో డిప్యూటీ సూపరింటిడెంట్‌గా పనిచేసి రిటైరయ్యారు. అమ్మ ఇందిరా రావత్. గృహిణి. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని మండి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ డిగ్రీ పూర్తి చేశాను. రెండేళ్ల పాటు ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేశాను. ఆ సమయంలో డీఎస్పీ, ఎస్పీ వంటి అధికారులకు ప్రజలిచ్చే గౌరవం చూసి పోలీస్ అధికారి కావాలని నిర్ణయించుకున్నాను. ఢిల్లీకి వెళ్లి సివిల్స్ సాధనే లక్ష్యంగా ప్రయత్నించాను. రెండు సార్లు పరీక్షలు రాసినా సఫలం కాలేపోయా. నాన్న అందించిన స్ఫూర్తితో పట్టుదలతో చదివి మూడో ప్రయత్నంలో లక్ష్యం సాధించా. 2021 సివిల్స్‌లో ఐపీఎస్‌గా కేరళ క్యాడర్‌కు ఎంపికయ్యాను. ప్రస్తుతం ఎర్నాకులం జిల్లా పెరంబూదూర్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్నాను. అపజయాలు చూసి కుంగిపోవద్దు. సంకల్పం వీడకుండా ప్రయత్నిస్తే లక్ష్యం తప్పకుండా చేరువవుతుంది.

– మోహిత్ రావత్, ఐపీఎస్

సొంతంగానే సన్నద్ధమయ్యా..



నాది ఢిల్లీ. నాన్న బిజేందర్ సింగ్. పోలీస్ అధికారి. అమ్మ ఇందు. గృహిణి. ఢిల్లీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేశాను. కళాశాలలో చదివే సమయంలోనే సివిల్స్‌పై అవగాహన పెంచుకున్నా. ఎమ్మెస్సీ పూర్తి కాగానే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాను. తొలి రెండు ప్రయత్నాల్లో విఫలమయ్యాను. అయితే ఎప్పుడూ నిరాశకు లోను కాలేదు. లక్ష్యాన్ని వీడకుండా పట్టుదలతో ముందుకెళ్లా. మూడో ప్రయత్నంలో సక్సెస్ వచ్చేసింది. 2024 సివిల్స్‌లో 19వ ర్యాంకు సాధించి ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యాను. ఎలాంటి కోచింగ్ వెళ్లకుండా సొంతంగా సన్నద్ధమయ్యా. లక్ష్యాన్ని నెరవేర్చుకున్నా.

– సిమ్రాన్, ఐఎస్ఎస్

అమ్మ నుంచే స్ఫూర్తి పొందా..



నాది పంజాబ్ రాష్ట్రం బటాల గ్రామం. అమ్మ మారుమూల గ్రామంలో స్కూల్ టీచర్‌గా పనిచేసేది. పట్టణ, గ్రామీణ ప్రాంతానికి ఉన్న వ్యత్యాసాలను చిన్నప్పుడే దగ్గరగా చూశా. పల్లె ప్రాంతాల దుస్థితిని చూసి వాటిని మార్చాలంటే సివిల్స్‌తోనే సాధ్యమని తెలుసుకున్నాను. అమ్మ ఇచ్చిన స్ఫూర్తితోనే ముందడుగు వేశాను. ఢిల్లీ యూనివర్సిటీలో ఎంకాం పూర్తి కాగానే సివిల్స్ వైపు దృష్టి సారించా. పట్టుదలతో ప్రయత్నించి నా కల నెరవేర్చుకున్నా. 2021 సివిల్స్‌లో సత్తా చాటి హిమాచల్‌ప్రదేశ్ క్యాడర్‌లో ఐపీవోఎస్‌కు ఎంపియ్యాను. ప్రస్తుతం పోస్టల్ డిపార్టుమెంట్‌లో సినీయర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ తపాలా సేవలను అట్టడుగు వర్గాలకు అందించేలా కృషి చేస్తున్నాను.

– పవన్‌జ్యోత్ కౌర్, ఐపీవోఎస్

తొలి ప్రయత్నంలోనే..



నాది మహారాష్ట్రలోని గోండియా జిల్లా హర్దూరి గ్రామం. నాన్న వెంకట్‌రావు చనాప్. రిటైర్డు పోలీస్ అధికారి. అమ్మ యశోదాబాయి. గృహిణి. పూణేలో మెకానికల్ ఇంజినీర్ పూర్తి చేశాను. కొద్దిరోజుల పాటు ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తూ సివిల్స్‌కు సన్నద్ధమయ్యాను. తర్వాత జాబ్ వదిలి ఫోకస్ పెంచా. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించా. 2021 సివిల్స్ ఫలితాల్లో ఐఎఫ్ఎస్ మధ్యప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికయ్యాను. ప్రస్తుతం అక్కడి సాగర్ జిల్లా నోరాదేవి టైగర్‌జోన్‌కు ఎస్‌డీపీవోగా పనిచేస్తున్నా. శిక్షణలో భాగంగా ఇక్కడకు వచ్చి పథకాలను అధ్యయనం చేస్తున్నా.

– దేవిడ్ వెంకట్‌రావు చనాప్, ఐఎఫ్ఎస్

పట్టుదలే.. సక్సెస్ మంత్రం



నాది కర్నాటక రాష్ట్రంలోని బీదర్. నాన్న ఫిరొజుద్దీన్ ఖాన్ ఏఈఈగా రిటైరయ్యారు. అమ్మ జోఫిషాన్ గృహిణి. గౌహతిలోని ఐఐటీలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. అనంతరం ఉద్యోగ సాధనలో భాగంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యా. అసిస్టెంట్ కమిషనర్ (జీఎస్టీ)గా వాణిజ్యపన్నుల శాఖలో ఉద్యోగం సాధించాను. తెలంగాణలోని హైదరాబాద్ జీడిమెట్లలో అసిస్టెంట్ కమిషనర్‌గా కొన్నేళ్లపాటు విధులు నిర్వహించాను. ఈ క్రమంలోనే సివిల్స్ వైపు దృష్టి సారించా. పట్టుదలతో ప్రయత్నించాను. 2022 ఫలితాల్లో సక్సెస్ సాధించా. ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యాను. పట్టుదల, సంకల్పమే నా విజయానికి నాంది.

– ఎండీ.ఖమరుద్దీన్‌ఖాన్, ఐఆర్ఎస్

న్యూస్‌రీల్

సీఎంపై ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బూటక హామీలతో ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఎస్పీని క్యాంపు కార్యాలయంలో కలిసి ఫిర్యాదు కాపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలను మోసం చేసిన సీఎంపై చీటింగ్ కేసునమోదు చేయాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు రమేశ్, నారాయణ, పరమేశ్వర్ తదితరులున్నారు.

'చింతల్‌బోరి'లో పులి సంచారం

బోథ్: మండలంలోని చింతల్‌బోరి నుంచి వజ్జర్ వైపు వెళ్లే అడవి మార్గంలో పులి మంగళవారం సంచరించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో కనిపించగా విషయాన్ని అటవీ అధికారులకు తెలియజేశారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా పులి కనిపించినట్లు పేర్కొన్నారు. ఇది మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కలెక్టర్ రాజర్షి షా



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

సిరికొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలతో పాటు సుంకిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. జెడ్పీ పాఠశాలలో భోజనం రుచికరంగా ఉండడం లేదని విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. అలాగే పదోతరగతి పరీక్ష కేంద్రం స్థానికంగా అందుబాటులోలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కాగా, వివిధ కారణలతో తల్లిదండ్రులను కోల్పోయిన మండల కేంద్రానికి చెందిన దాసరి మేఘన, దాసరి రిషి లను కలెక్టర్ చొరవచూపి గురుకుల పాఠశాలలో చేర్పించారు. ఇందులో డీఈవో ప్రణీత, డీపీఆర్వో తిరుమల, తహశీల్దార్ తుకారాం, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్, ఎంఈవో సునీల్, ఉపాధ్యాయులు,పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఆదిలాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన ఆన్‌లైన్ 45 రోజులుగా పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కార్మికులకు రెన్యువల్ విధానం రద్దుచేసి ఆధార్ తరహా శాశ్వత కార్డు అందించాలన్నారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే ఉస్మాన్, ఉపాధ్యక్షుడు కీర్తి రమణ, సహాయ కార్యదర్శి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: అనంతరం జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో ఆయన మాట్లాడారు. సాధారణ మరణానికి రూ.లక్ష, పెళ్లి కానుక రూ.లక్ష, ప్రసూతి కానుక రూ.లక్ష, యాక్సిడెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే 60 ఏళ్లు దాటిన వారికి రూ.5వేల పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు.

24న కేటీఆర్ సభ జయప్రదం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: రైతాంగ సమస్యలపై జిల్లా కేంద్రంలో ఈనెల 24న నిర్వహించనున్న సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని, ఈ సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. అధికారంలోకి వచ్చిన 300 రోజుల్లో 300మంది బలవన్మరణాలకు పాల్పడినట్లు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలపై కేటీఆర్ శంఖారావం పూరించనున్నారని, ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇందులో పార్టీ నాయకులు రమేశ్, అజయ్, నారాయణ, వేణుగోపాల్ యాదవ్, పాల్గొన్నారు.

రూ.కోటి విలువైన గంజాయి దహనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో 48 కేసుల్లోపట్టుబడ్డ 410 కిలోల గంజాయిని సోమవారం సాయంత్రం నిజామాబాద్ జిల్లాలో దహనం చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నర్సింహరెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 340 కేజీలు, ఇచ్చోడలో 37 కేజీలు, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో 33 కేజీల గంజాయిని దహనం చేసినట్లుగా పేర్కొన్నారు. వీటి విలువ రూ.కోటి వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.నిజామాబాద్‌లోని శ్రీమెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఈ గంజాయిని దహనం చేసినట్లువివరించా రు. ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ గౌస్ ఆలం



యావత్మాల్ కలెక్టర్‌తో సమావేశమైన జిల్లా ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సరిహద్దు జిల్లాల అధికారుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చేపట్టాల్సిన నిఘా చర్యలపై అక్కడి కలెక్టర్ పంకజ్ ఆశియా, ఎస్పీ కుమార్ చింతలతో ఆదిలాబాద్ ఎస్పీ చర్చించారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం తరపున అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని ఆదిలాబాద్ ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో ఏడు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఉన్నాయని, అవి 24గంటల పాటు పనిచేసేలా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి నిఘా ఉంచుతామన్నారు. ఈ ఎన్నికల్లో ప్రభావితం చేసే మద్యం, నగదు, బహుమతులను తరలించకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

26న రక్తదాన శిబిరరం

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకొని ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. యువజన సంఘాల నాయకులు ఎస్పీని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మెగా రక్తదాన శిబిరంలో యువత భాగస్వాములు కావాలని కోరారు. ఇందులో యువజన సంఘాల సమితి అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ, అర్బాత్‌ఖాన్, ఖాజా సిరాజొద్దీన్, గణేశ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే విజయం



ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

ఆదిలాబాద్: నిరంతర సాధనతోనే విజయం సాధ్యమవుతుందని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ -17 బాల, బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఎస్జీఎఫ్ క్రీడలతో ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు మాట్లాడుతూ, జోనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 28నుంచి 30 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో పీఈటీలు హరిచరణ్, రాజేష్, వెంకటరమణ, జయశ్రీ, జ్యోతి, వినోద తదితరులున్నారు.

క్లుప్తంగా

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

శ్రీరాంపూర్: గంజాయి కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కే 6 గని నుంచి రామకృష్ణాపూర్‌కు వెళ్లే మెయిన్ రోడ్డులో చెట్ల పొదల వద్దకు వెళ్లగా దెబ్బటి నవదీప్, వడ్డేపల్లి యశ్వంత్ గంజాయితో దొరికినట్లు తెలిపారు. తమను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద 210 గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చిన్నారులపై కుక్కల దాడి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలిలో మంగళవారం వీధి కుక్కలు ఐదేళ్ల బాలుడు, 13ఏళ్ల బాలికపై దాడిచేసి గాయపరిచాయి. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కుక్కల వరుస దాడులతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి గ్రామంలో సంచరిస్తున్న వీధి కుక్కలను అరికట్టాలని కోరుతున్నారు.

24న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి రజనికిరణ్ తెలిపా రు. డిగ్రీ పాసై 18 నుంచి 30 సంవత్సరాలలోపు ఉన్న యువకులకు శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9110368501, 9640731731 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్లకు చెందిన గోలివాడ చంద్రయ్య కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లగా అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్ వైర్‌ను తాకడంతో షాక్‌కు గురయ్యాడు. శరీరం కాలడంతో రోడ్డుపైకి వచ్చి గట్టిగా అరిచాడు. గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మట్కా ఆడుతున్న ముగ్గురిపై కేసు

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో మంగళవారం మట్కా ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నిర్వహించిన దాడిలో మట్కా ఆడుతున్న ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి మట్కా చిట్టీలతో పాటు రూ.5,390 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో రెండు వేర్వేరు చోట్ల పేకాట స్థావరాలపై మంగళవారం దాడులు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. రాంపూర్ సమీపంలో నలుగురు పేకాట ఆడుతూ పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.13,650 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జందాపూర్ రైల్వే వంతెన సమీపంలో దాడులు నిర్వహించగా ఎనిమిది మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.4,060తో పాటు పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో పట్టుబడినవారు పట్టణానికి చెందిన వ్యక్తులుగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

డియర్.. న్యూ టీచర్

- విద్యార్థుల భవిత.. మీ బాధ్యత
- అంకితభావం.. వృత్తి నిబద్ధతే లక్ష్యం
- మీరు పడ్డ కష్టాలను మరువొద్దు
- దారితప్పిన సీనియర్ల బాట వద్దు
- ఊళ్లనే కదిలించిన సార్లే స్ఫూర్తి


దస్తురాబాద్ మండల విద్యాధికారి కార్యాలయంలో పోస్టింగ్ ఆర్డర్ తీసుకుంటున్న కొత్త ఉపాధ్యాయులు

ఉమ్మడి జిల్లాకు కొత్తగా వచ్చిన టీచర్లు

జిల్లా	టీచర్లు
ఆదిలాబాద్	256
మంచిర్యాల	245
నిర్మల్	278
కుమురం భీం	270

నిర్మల్: టీచర్.. ఇది కేవలం ఒక జాబ్ మాత్రమే కాదు. 'మా సార్ ఏం చెబుతారోనని..' కళ్లముందు మిమ్మల్నే ఆశగా చూస్తూ కూర్చున్న భావిపౌరుల జీవితాలను మలిచే వృత్తి. సమాజంలో ఎన్నో వృత్తులు ఉన్నా.. అత్యున్నత స్థానం ఉపాధ్యాయ వృత్తిదే. అలాంటి పవిత్ర వృత్తిలోకి ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1049 మంది కొత్తగా అడుగు పెట్టారు. వారంతా తమ విధుల్లో చేరి దాదాపు వారం రోజులు అవుతోంది. ఈ వారం రోజుల్లో తమ బడులు, తరగతులు, విద్యార్థులతో పాటు తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులను పరిచయం చేసుకున్నారు. ఎంతో కష్టపడి బీఈడీ/డీఈడీ పూర్తిచేసి, డీఎస్సీలో ఎంతోమందితో పోటీపడి.. చివరకు అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ఎంతో కష్టపడితే తప్పా.. ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చే పరిస్థితి లేదు. అలాంటి టీచర్ జాబ్‌కు సంపూర్ణ న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల విద్యావ్యవస్థలో నెలకొన్న పరిణామాలను సైతం దృష్టిలో పెట్టుకుని, తాము ఎలా ముందుకు సాగాలో నిశ్చయించుకోవాల్సిన అవసరమూ ఉంది.

లక్ష్యం మరువొద్దు..

ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి బడిలోకి అడుగుపెట్టిన ప్రతీఒక్కరు విద్యార్థులకు ఏదైనా చేయాలన్న లక్ష్యంతోనే వస్తారు. మొదట్లో అందరూ బాగానే ఉంటారు. కానీ.. ఆ తర్వాత చాలామంది మారిపోతుంటారు. కొత్తదనం తీసుకురావాలనుకున్న వారు సైతం కొంతకాలానికే మూస ధోరణిలోకి వెళ్లిపోతుంటారు. బడికి వెళ్లామా.. ఇంటికొచ్చామా.. అనే తీరులోకి వచ్చేస్తారు. ఇలాంటి వారికి సమాజంలో గుర్తింపు కూడా అంతంతగానే ఉంటుంది. ఎవరైతే తమ లక్ష్యాన్ని మరువకుండా విద్యార్థుల కోసం శ్రమిస్తారో.. వారికే గుర్తింపు ఉంటుంది.

పిల్లల కోసమే..

కష్టపడి ఉద్యోగం సాధించింది కేవలం నెల వేతనం కోసం కాదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. మీరు తరగతి గదిలోకి అడుగుపెట్టగానే.. 'మా సార్/టీచర్ ఈరోజు ఏదో కొత్తగా చెబుతారు..'అన్న ఆశతో చూసే అమాయక పిల్లల జీవితాలు మీ చేతుల్లోనే ఉన్నాయన్న విషయాన్ని మర్చిపోవద్దు. వారికి పాఠాలు చెప్పకుండా సెల్‌ఫోన్లు పట్టుకుని పర్సనల్ పనులు చేసుకోవడమంటే.. తమకు తామే మోసం చేసుకుంటున్నామన్న విషయాన్ని గుర్తించాలి. తాము ఇక్కడి దాకా రావడానికి ఎంతోమంది ఉపాధ్యాయుల బోధనలేనన్న విషయాన్నీ మర్చిపోవద్దు. తమ ముందు ఉన్న విద్యార్థుల జీవితాలనూ తీర్చిదిద్దాల్సిన బాధ్యతను విస్మరించవద్దు.

వారే మార్గదర్శకులు..

ఇటీవల బదిలీల్లో చాలా గ్రామాల్లో తమ ఉపాధ్యాయులు బడిని వీడిపోతుంటే.. పిల్లలు వెక్కివెక్కి ఏడ్చిన సందర్భాలు చూశాం. కొన్ని ఊళ్లల్లో పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు సైతం 'సార్.. మీరిక్కడే ఉండండి..' అంటూ బతిమాలిన తీరునూ గమనించాం. కొన్నిచోట్ల తమ సార్ ఏ స్కూల్‌కు వెళ్తే.. తాము అక్కడికే వెళ్లి చదువుకుంటాం.. అని విద్యార్థులు వెళ్లిన సందర్భాలూ చూస్తున్నాం. ఇంతలా ఆ సార్లు వాళ్లకు ఏం చేశారు.. అని ప్రశ్నిస్తే.. ఆ ఉపాధ్యాయులంతా తమ వృత్తిని నిబద్ధతతో, అంకితభావంతో చేశారంతే. అదే వారిని ఆ ఊళ్లకు, పిల్లలకు గురుదేవుళ్లను చేసింది. ఇలాంటి సార్లే కొత్త టీచర్లకు మార్గదర్శకులు కావాలి.

దారి తప్పొద్దు..

కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టగానే తోటి ఉపాధ్యాయులే మార్గదర్శనం చేస్తుంటారు. లేదంటే వారి దగ్గర నుంచే పనితీరు తెలుసుకోవాల్సి వస్తుంది. ఈక్రమంలో తమను తప్పుదోవ పట్టించే సీనియర్లకు దూరంగా ఉండటమే ఉత్తమం. ఇటీవల నిర్మల్ జిల్లాలో కొంతమంది ఉపాధ్యాయులు అత్యాశకు పోయి, కాయిన్‌దందాలో ఇరుక్కుని, అరెస్టులు, జైళ్ల దాకా వెళ్లి విద్యావ్యవస్థకు మాయని మచ్చ తీసుకొచ్చారు. ఇక చాలామంది రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, ఇతర వ్యాపారాలంటూ అసలు పనిని గాలికొదిలేస్తుంటారు. కొత్త ఉపాధ్యాయులు ఇలాంటి సీనియర్ల బాటలో నడవద్దు. ముమ్ముందు ఇబ్బందుల పాలు కావొద్దు.

పంటచేలోనే ప్రాణాలొదిలాడు..

- విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి


సతీశ్(ఫైల్)

కోటపల్లి(చెన్నూర్): పత్తి చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లిన యువరైతు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని రాపన్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బూర్తి సతీశ్ (24) నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని అందులో పత్తి పంట సాగు చేశాడు. మంగళవారం ఉదయం చేనుకు నీరు పెట్టడానికి వెళ్లాడు. మోటార్‌ను ఆన్‌చేసి నీరు పెడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోటార్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు పత్తి చేనుకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. పత్తి పంటకు నీరు పెట్టి వస్తానని చెప్పి వెళ్లిన కొడుకు రాలేదని తల్లి, కుటుంబ సభ్యులు రోధించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. ఎస్సై రాజేందర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించాడు. మృతుని తండ్రి రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజేందర్

పురుగుల మందుతాగి వృద్ధుడు ఆత్మహత్య

తిర్యాణి: పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తీగల మాధవ్ తెలిపిన వివరాల ప్రకారం పెర్కపెల్లికి చెందిన చుంచు రాజలింగం(82) భార్య ఐదేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 19న తన ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైనా వైద్యం కోసం వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు బాపు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని ఉమర్‌ఖేడ్ తాలుకా టాక్లీ గ్రామానికి చెందిన హరల్ బాలాజీ (32) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఐదేళ్లుగా మద్యానికి బానిసైన బాలాజీ సోమవారం డబ్బుల కోసం భార్యను వేధింపులకు గురిచేశాడు. ఆమె ఇవ్వకపోవడంతో ఇంటి వద్దనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు..

ఇంద్రవెల్లి(ఖానాపూర్): కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడగామ్‌లో చోటు చేసుకుంది. ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం జైనూర్ మండలంలోని డబోలి గ్రామానికి చెందిన మెస్రం రాజేశ్ (20) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈనెల 20న ఇంద్రవెల్లి మండలంలోని వడగామ్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. 21న పాటగూడ శివారులోని పంటచేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు బంధువులకు సమాచారం అందించడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి మెస్రం భీంరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పులబాధతో ఒకరు..

భైంసారూరల్: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని బిజ్జూర్ గ్రామానికి చెందిన గుండేరావు సుభాష్(34) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణం చేపట్టగా రూ.4 లక్షల మేర అప్పులయ్యాయి. అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య త్రిశీల, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యార్థుల అదృశ్యం.. ఆచూకీ లభ్యం

భైంసాటౌన్(ముథోల్): భైంసా పట్టణంలోని ఎస్సీ హాస్టల్ నుంచి మంగళవారం నలుగురు విద్యార్థులు అదృశ్యం కావడం స్థానికంగా కలకలం రేపింది. అనంతరం ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులు ఊపి రి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక ఎస్సీ హాస్టల్‌లో వసతి పొందుతున్న చరణ్, కేశవ్ (ఆరో తరగతి), రాకేశ్ (ఎనిమిది), ఈశ్వర్(ఐదు) మంగళవారం ఉదయం హాస్టల్ గోడ దూకి పారిపోయారు. విషయం తెలుసుకున్న వార్డెన్ నాగేశ్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చి వార్డెన్‌ను నిలదీశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ గోపీనాథ్ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సీసీ ఫుటేజీ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. పల్సితండా వద్ద విద్యార్థుల ఆ చూకీ దొరికింది. దీంతో వారిని భైంసాకు తీసుకొచ్చి బాలల సంరక్షణ అధికారుల సమక్షంలో విద్యార్థుల తల్లి దండ్రులకు అప్పగించారు.

ఎస్సీ గురుకులం నుంచి విద్యార్థి..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి మంగళవారం తొమ్మిదో తరగతి విద్యార్థి చెన్న అంజి గోడ దూకి పరారయ్యాడు. గుడిపేట వద్ద చర్చి సమీపంలో తిరుగుతుండగా స్థానికులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వెంట తీసుకుని ఇంటికి వెళ్లారు. ఇటీవల ఓ విద్యార్థి పాఠశాలలోని మొదటి అంతస్తు నుంచి కింద పడగా మెట్లపై జారిపడ్డాడని ప్రిన్సిపాల్ చెప్పడం కొసమెరుపు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఒకరు మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన రవునే సంతోష్ (27) ఆగిఉన్న వాహనాన్ని ఢీకొట్టి మృతి చెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కిన్వట్ తాలుకా లింగికి చెందిన సంతోష్ సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రలోని మాండ్వీకి వెళ్తుండగా రోడ్డుపై ఆగి ఉన్న టాటాఏసీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం


రామారెడ్డి (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ కు చెందిన పన్నాల రామారెడ్డి (80) అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రామారెడ్డి మంగళవారం ఉదయం దిలావర్‌పూర్‌లో ఉన్న బంధువుల వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా దిలావర్‌పూర్ చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి


భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీలు


ర్యాలీలో పాల్గొన్న మహిళలు

- ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్
- నార్నూర్‌లో కుమురం భీంకు ఘన నివాళి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో 1/70, పెసా చట్టాలను పక్బందీగా అమలు చేయాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, రాయి సెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో కుమురంభీం వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ గిరిజనులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీలతో పాటు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐలు మొగిలి, రహీంపాషా భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారీ వర్షంలోనూ ఆదివాసీలు ఖందేవ్ ఆలయం నుంచి కుమురంభీం భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ మహిళలు సంప్రదాయ నృత్యం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీ చట్టాల అమలు కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. విద్య, వైద్యరంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు ఉపాధి, ఉద్యోగాలకోసం పోటీ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు పుష్పలత, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, కార్యదర్శి పెందూర్ సంతోష్, ఉర్వేత రూప్‌దేవ్, కనక ప్రభాకర్, మెస్రం మానిక్‌రావు, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

- ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్
- వీసీని కలిసిన అధ్యాపక సంఘం నేతలు


వీసీని సన్మానిస్తున్న ట్రిపుల్‌ఐటీ అధ్యాపక సంఘం

భైంసా: అందరం సమన్వయంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధిద్దామని బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ అన్నారు. ట్రిపుల్‌ఐటీ అధ్యాపక సంఘం నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా ఆయనతో భేటీ అయ్యారు. ముందుగా గోవర్ధన్‌కు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం అధ్యాపక సంఘంతో వీసీ మాట్లాడారు. బాసర ట్రిపుల్‌ఐటీలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న వారంతా మరింత శ్రద్ధ చూపించాలని సూచించారు. అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. క్యాంపస్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం, జనరల్ సెక్రటరీ కృష్ణప్రసాద్, సహ కార్యదర్శులు సతీశ్‌కుమార్, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ రాములు, వసంత్‌బాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆమ్‌స్టర్‌డమ్ మారథాన్‌లో నిర్మల్ వైద్యుడి ప్రతిభ

- ఏకధాటిగా 35 కి.మీల పరుగు


లక్ష్యానికి చేరువైన అనంతరం విజయసూచికను చూపుతున్న వైద్యుడు బీఎల్ఎన్ రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాకు చెందిన వైద్యుడు నెదర్లాండ్ దేశంలోని ఆమ్‌స్టర్‌డమ్‌లో నిర్వహించిన మారథాన్ పరుగులో తనదైన శైలిలో ప్రతిభను కనబర్చాడు. జిల్లా కేంద్రంలో నరాల వైద్యనిపుణుడిగా సేవలందిస్తున్న డాక్టర్ బి.లక్ష్మీనరసింహారెడ్డి నెదర్లాండ్ దేశ ప్రధాన నగరం ఆమ్‌స్టర్‌డమ్‌లో నిర్వహించిన మారథాన్‌లో పాల్గొన్నారు. నాలుగు గంటల వ్యవధిలో 34.8 కి.మీ దూరం లక్ష్యాన్ని చేరుకుని తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ప్రతీరోజు సైక్లింగ్, రన్నింగ్ చేసే లక్ష్మీనరసింహారెడ్డి ఆమ్‌స్టర్‌డమ్ నగరంలో టీసీఎస్ సంస్థ నిర్వహించిన 49వ మారథాన్–2024లో పాల్గొన్నారు. 147 దేశాల నుంచి ఔత్సాహిక ఒలింపిక్ క్రీడాకారులు, ఎలైట్ రన్నర్స్, అథ్లెట్లు, ఫిట్నెస్ ఔత్సాహికులు పాల్గొన్నారు. వీరి లో నిర్మల్ వైద్యుడు ప్రతిభ చాటడం గమనార్హం. ఈ మేరకు నిర్వాహకులు ప్రత్యేక విన్నర్ షీల్డ్‌ను బహూకరించారు.

సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు మెడికల్ స్క్రీనింగ్

- 10 ఖాళీల భర్తీకి శ్రీకారం
- మెడికల్ గ్రౌండ్ కింద 432 దరఖాస్తులు
- నేటి నుంచి మూడు రోజులపాటు పరిశీలన

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌ల ఖాళీల భర్తీకి అధికారులు ఇటీవలే నోటిఫికేషన్ ఇచ్చి ప్రక్రియ మొదలు పెట్టారు. వీటిని అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే జనరల్ మజ్దూర్‌లు, ఇతర కేటగిరీ(టైం రేటెడ్)లతో భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే 98 మందిని ప్యానల్ జాబితా ఆధారంగా ఎంపిక చేసి లెటర్లు ఇచ్చారు. అందులో 10 శాతం మెడికల్ కోటాకింద భర్తీ చేస్తున్నారు. ప్రమాదాల్లో కాళ్లు, చేతులు విరిగిన వారు, వెన్ను జబ్బులతో బాధపడే వారు, ఇతర శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు.. ఇలా తీవ్రంగా క్షతగాత్రులైన వారి నుంచి కంపెనీ దరఖాస్తులు ఆహ్వానించింది. మొత్తం 432 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పది మందిని మాత్రమే సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు ఎంపిక చేస్తారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దీనికి సంబంధించిన స్క్రీనింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు.

కమిటీ సమక్షంలో నిర్ధారణ..

ఈ ఖాళీల భర్తీకి ఎస్‌వోటూ జీఎం అధ్యక్షతన డీజీఎం(ఐఈడీ), డీజీఎం(పర్సనల్), డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్, ఆర్థోసర్జన్ ఇంకా ఇతర అధికారులు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ దరఖాస్తు చేసుకున్న వారి మెడికల్ రిపోర్టుల ఆధారంగా ఆర్డర్ లిస్టును తయారు చేస్తుంది. దీని ఆధారంగా పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు మొదటి పదిమందిని ఎంపిక చేస్తారు. గనుల వారీగా మొదట స్క్రీనింగ్ చేసిన తర్వాత ఏరియా స్థాయిలో చేస్తే ప్రక్రియ సులువుగా ఉండేదని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌ల ఖాళీల భర్తీకి ఎట్టకేలకు మోక్షం రావడంతో కార్మికులు స్క్రీనింగ్ అనంతరం వచ్చే ఫలితాల కోసం వేచి చూస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్(చెన్నూర్): ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూనిర్వాసిత, ఇతర యువకులను కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్నప్పటికీ వేతనాల చెల్లింపుల్లో ఇతర రాష్ట్రాలకు ఒక విధంగా, స్థానికులకు మరోలా చెల్లిస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. 13 సార్లు హైదరాబాద్ రీజినల్ కమిషనర్ కార్యాలయంలో చర్చించినప్పటికీ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారన్నారు. సమావేశంలో హెచ్ఎంఎస్ నాయకులు జక్కుల నారాయణ, ఎస్టీపీపీ ప్రధాన కార్యదర్శి విక్రమ్, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సందీప్‌రెడ్డి, నవీన్, చారి, సంతోష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ వీడియో తీసుకుని వ్యక్తి ఆత్మహత్య


దేవన్న (ఫైల్)

తాంసి(బోథ్): జీవితంపై విరక్తి చెందిన ఒకరు సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పొన్నారి గ్రామానికి గుమ్ముల దేవన్న (38) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబంలో తగదాల వల్ల అతని భార్య కొంతకాలంగా పుట్టింట్లో ఉంటుంది. దీంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం హస్నాపూర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి సెల్ఫీ వీడియోలో మాట్లాడుతూ తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొన్నాడు. తాను మద్యం తాగడం లేదని, కొందరు వ్యక్తులు మద్యం తాగుతున్నాడని హేళన చేస్తున్నారన్నాడు. ఈ వీడియోను కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు పంపించి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. వీడియోను చూసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడికి వెళ్లగా రైల్వే ట్రాక్ పక్కన మృతదేహం పడి ఉండడం గమనించారు. రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు.